# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-10-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **తిరుపతిలోని నేషనల్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కేంద్రాన్ని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ ఈరోజు ప్రారంభించారు.**
2. **వాయుగుండం ప్రభావంతో ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.**
3. **తిరుపతిలో జరిగే ఖాదీ ఉత్సవ్ ప్రదర్శనలో కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్ ఈరోజు పాల్గొంటారు.**
4. **డీఎస్సీ ద్వారా పారదర్శకంగా ఉపాధ్యాయ ఉద్యోగాల నియామకాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వి. అనిత తెలిపారు.**
5. **ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం ప్రారంభమై ఈరోజుతో 11 ఏళ్ళు పూర్తి చేసుకుంది.**

==========================

తిరుపతిలోని నేషనల్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ – నైలెట్ కేంద్రాన్ని కేంద్ర ఎలక్ట్రానిక్స్ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ ఢిల్లీ నుంచి దృశ్య మాధ్యమ విధానంలో ఈ రోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దిల గురుమూర్తి పాల్గొని మాట్లాడుతూ, నైలెట్ కేంద్రం సాంకేతిక శిక్షణకు కొత్త మలుపని, ఈ కేంద్రం ద్వారా యువతకు ఆధునిక ఐటీ సాంకేతికతతో పాటు ఎలక్ట్రానిక్స్ రంగంలో ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

--------------------------

ఒడిశాలోని గోపాల్‌పూర్ వద్ద తీవ్ర వాయుగుండం తీరం దాటినట్లు అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. వాయువ్య దిశగా కదిలి బలహీన పడుతున్నట్లు పేర్కొంది. తీరం దాటినా తీవ్ర వాయుగుండం ప్రభావం కొనసాగుతుందని ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారి బి.శేఖర్ తెలియజేస్తూ,

వాయిస్ ..23 సెకన్లు

మరోవైపు వాయుగుండం ప్రభావంతో ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి విజయనగరం జిల్లాలో వర్ష ప్రభావానికి పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. చీపురుపల్లి – సుభద్రాపురం

రహదారిపై వరద చేరింది. పార్వతీపురం మన్యం జిల్లాలో వర్షాలకు అరటి పంటకు తీవ్ర నష్టం కలిగింది. విశాఖపట్నం నగరంలో ఈదురు గాలులు, వర్షాలకు రోడ్లపై పడిన చెట్లను మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ–జివిఎంసి సిబ్బంది తొలగిస్తున్నారు. ఈదురుగాలుల ప్రభావంతో నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు సహా చెట్లు కూలిపోయాయని. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం జీవీఎంసీ, విద్యుత్, విపత్తు నిర్వహణ సిబ్బంది చెట్లను తొలగించే చర్యలు చేపట్టారని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. దాదాపు 80 ప్రాంతాల్లో 150 చెట్లను తొలగించినట్లు వెల్లడించారు.

---------------------------

వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో భారీ వర్షాల నేపథ్యంలో వ్యవసాయ, ఉద్యానవన పంటల నష్టాన్ని ప్రాథమిక అంచనా వేయాలని అధికారులను వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులతో మంత్రి శ్రవణమాధ్యమం ద్వారా ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వాయుగుండం ప్రభావం తగ్గిన తరువాత ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉంటుందని, అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

---------------------------

ఖాదీ ఉద్యమస్ఫూర్తి తెలిపేలా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఖాదీ సంతలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తిరుపతిలో జరిగే "ఖాదీ ఉత్సవ్ ప్రదర్శనలో కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్ ఈరోజు పాల్గొంటారు.

మరోవైపు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న ఖాదీ సంతను కేంద్ర భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ నిన్న సందర్శించారు. ఖాదీ వంటి స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పేర్కొంటూ,

వాయిస్ 29 సెకన్లు

కాగా… విజయవాడలో జరిగే ఖాదీ సంత ముగింపు కార్యక్రమంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఈరోజు పాల్గొంటారు.

---------------------------

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలులోని శంకరగుప్తం మురుగు నీటి వ్యవస్థ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. రాజోలులో డ్రెయినేజీ నీరు ద్వారా పాడైపోతున్న కొబ్బరి తోటలను మంత్రి నిన్న పరిశీలించారు. అనంతరం స్థానిక రైతులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ,

వాయిస్ 29 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాశవాణి ద్వారా తన మనసులోని భావాలను దేశ ప్రజలతో పంచుకునే

"మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం ఈ రోజుతో 11 ఏళ్ళు పూర్తి చేసుకుంది. 2014 అక్టోబర్ 3న ప్రధానమంత్రి "మన్ కీ బాత్" తొలి సంచికను ప్రారంభించారు. ఇది ప్రధానమంత్రిని దేశ ప్రజలతో నేరుగా అనుసంధానించే ఒక ప్రత్యేకమైన కార్యక్రమంగా పేరుపొందింది. భారతీయుల మనసులో మాటగా.. దేశ ప్రజలందరి భావనలకు ప్రతిరూపంగా నిలుస్తున్న మన్ కీ బాత్ కార్యక్రమం ఇప్పటివరకు 126 సంచికలను పూర్తి చేసుకుంది. ఈ కార్యక్రమం ఒక ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుందని 100 వ సంచిక సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ,

వాయిస్ 34 సెకన్లు

---------------------------

డీఎస్సీ ద్వారా పారదర్శకంగా ఉపాధ్యాయ ఉద్యోగాల నియామకాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వి. అనిత తెలిపారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులను ఆమె ఈ రోజు సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్ది స్ఫూర్తిగా నిలవాలని కొత్త ఉపాధ్యాయులను మంత్రి కోరారు.

---------------------------

వస్తు సేవల పన్ను– జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక లబ్ధి చేకూరుతోందని వాణిజ్యతర పన్నుల శాఖ –జిఎస్టి జాయింట్ కమిషనర్ కల్పన పేర్కొన్నారు. జీఎస్టీ 2.0 సంస్కరణల ప్రయోజనాలపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్" కార్యక్రమంపై విజయవాడలో ఈ రోజు పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,

వాయిస్ ...32 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం ఈ మధ్యాహ్నం సమావేశం కానుంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చ జరగనుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన జిఎస్టీ సడలింపులపై అవగాహనా కార్యక్రమాలు, ఈ నెల 16వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన వంటి అంశాలపై చర్చించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

---------------------------

విజయదశమి సందర్భంగా కర్నూలు జిల్లా దేవరగట్టులోని మాళ మల్లేశ్వరస్వామికి బన్నీ ఉత్సవాన్ని గతరాత్రి నిర్వహించారు. మాళ మల్లేశ్వరస్వామికి మల్లమ్మతో కల్యాణోత్సవం సందర్భంగా నిర్వహించిన కర్రల సమరంలో వంద మందికిపైగా భక్తులు గాయపడ్డారు. ఇద్దరు మృతి చెందారని, క్షతగాత్రులను ఆలూరు, ఆదోని ప్రభుత్వాసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నామని అధికారులు తెలిపారు.

=====================